22న ఆరాధన మహోత్సవం

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లిలోని ద్వాదశ జ్యోతిర్లింగ భువనేశ్వరి దేవస్థానంలో పుల్లూరు నారాయణ దాసు 25వ ఆరాధన మహోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయన కమిటీ చైర్మన్ గొట్టిముక్కల నాగేశ్వరరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మహోత్సవాలు జరుగుతాయని పేర్కొన్నారు. ఉదయం పాదుకాపూజ, క్షీరాభిషేకం, పుష్ప బిల్వార్చనలు, భజనలు, వేద పారాయణం కార్యక్రమాలు జరుగనున్నాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని, మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం ఉంటుందని తెలిపారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

మోతీనగర్: అవంతినగర్ తోట రెసిడెన్స్ సంక్షేమ సంఘం సహకారంతో ఆక్యుప్రెషర్, మాగ్నెటిక్, వైబ్రేషన్ థెరపీ, సుజోక్ థెరపీ ఉచిత ఆరోగ్య శిబిరాన్ని శుక్రవారం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు ఈ శిబిరం కొనసాగుతుందని పేర్కొన్నారు. డాక్టర్ డి.కె. వైష్ణవ ఆధ్వర్యంలో మెడనొప్పి, నడుమునొప్పి, మధుమేహం, తలనొప్పి, ఆస్తమా, థైరాయిడ్, అర్థరైటిస్, అసిడిటి, కీళ్లనొప్పులు, రక్తపోటు, కళ్లు, చెవి, ముక్కు సంబంధిత సమస్యలు, మోకాళ్లనొప్పులు, నిద్రలేమి వంటి 100కు పైగా సమస్యలకు శిబిరంలో చికిత్స అందించనున్నట్లు తెలిపారు. ఏ వయస్సులోని వారైనా శిబిరంలో చికిత్స చేయించుకోవచ్చని అన్నారు. చికిత్స కోసం నమోదు చేసుకున్న వారు నామమాత్రపు రుసుము క్రింద రూ.200 చెల్లించాలని తెలిపారు.

రూ. లక్ష ఆర్థికసాయం



మోతీనగర్: బీఆర్ఎస్‌వీ రాణా ప్రతాప్ నగర్ అధ్యక్షులు శివకుమార్ కుమారుడు వశిష్ఠ 10 నెలల చిన్నారి. ఈ బాబు బిలియరీ ఎట్రీషియాతో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న పార్టీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షులు మహ్మద్ గౌసుద్దీన్, గందె మల్లేశం, బైరపల్లి దాత ద్వారా లక్ష రూపాయల ఆర్థికసాయాన్ని బాధిత కుటుంబ సభ్యులకు బుధవారం అందజేశారు. కార్యక్రమంలో డివిజన్ కో ఆర్డినేటర్ వీరారెడ్డి, అబ్దుల్ హమీద్, అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన శిక్షణ



మూసాపేట: కూకట్‌పల్లి ఆర్టీసీ డిపోలో డ్రైవర్, కండక్టర్లకు బుధవారం పవర్ ట్రైనింగ్ ముగింపు కార్యక్రమం నిర్వహించారు. 13 రోజుల పాటు జరిగిన శిక్షణలో డ్రైవర్లు, కండక్టర్లు ప్రయాణికులతో ఏవిధంగా నడుచుకోవాలో వివరించారు. విధులను సక్రమంగా నిర్వహించాలని డిపో మేనేజర్ హరి అన్నారు. డ్రైవర్స్ డ్యూటీకి వచ్చేటప్పుడు మనస్సు ప్రశాంతంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ అసిస్టెంట్ మేనేజర్ శ్రీలత, మెకానికల్ ఇంజనీర్ రాజేశ్వరి, వెల్ఫేర్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆకస్మిక తనిఖీ

జగద్గిరిగుట్ట/నిజాంపేట్: జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సి. ఉమా గౌరి బుధవారం జగద్గిరిగుట్ట, బాచుపల్లిలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. తనిఖీలో భాగంగా జగద్గిరిగుట్టలో హాసిని ఫస్ట్ ఎయిడ్ క్లినిక్‌ను సీజ్ చేశారు. ఫార్మ్-డి అర్హత ఉన్న ప్రతీక్ అనే వ్యక్తి నకిలీ జనరల్ ఫిజీషియన్‌గా అవతారమెత్తి చికిత్స అందిస్తున్నాడు. దీంతో సీజ్ చేసి నోటీసులు అందజేశారు. అదేవిధంగా బాచుపల్లిలోని సహజ పాలీ క్లినిక్, బుచ్చిబాబు ఫస్ట్ ఎయిడ్ సెంటర్‌ను సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అనుభవం లేని వ్యక్తులు చట్టాన్ని ఉల్లంఘిస్తూ అక్రమంగా మందులు, ఇష్టానుసారంగా యాంటీబయాటిక్స్ రాయడం జరుగుతుందని అన్నారు. ఇలాంటి వారి వద్ద ట్రీట్‌మెంట్ తీసుకోకుండా ప్రజలు అప్రమత్తంగా ఉడాలని సూచించారు.

మద్యం మత్తులో వ్యక్తి మృతి

కుత్బుల్లాపూర్: మద్యం మత్తులో గుండెపోటు రావడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. ఒడిస్సా రాష్ట్రానికి చెందిన అమీర్‌కుమార్ (42), సుచిస్మిత భార్యాభర్తలు. వీరికి ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. వ్యాపారం చేసే అమీర్‌కుమార్ కుటుంబం కొంపల్లిలోని అపర్ణ తులిప్‌లో నివాసం ఉంటుంది. కుటుంబ కలహాల నేపథ్యంలో నాలుగు రోజుల క్రితం సుచిస్మిత ఒడిస్సాలోని తన పుట్టింటికి వెళ్లింది. మంగళవారం రాత్రి 9 గంటల ప్రాంతంలో అమీర్‌కుమార్‌తో ఫోన్‌లో మాట్లాడిన భార్య తిరిగి బుధవారం మరోసారి కాల్ చేయగా అతను లిఫ్ట్ చేయలేదు. దీంతో అనుమానం వచ్చి పక్కింటి వారికి ఫోన్ చేయగా.. వారు బాల్కనీలోంచి వెళ్లి చూడగా అతను అపస్మారకస్థితిలో పడి ఉన్నాడు. వెంటనే 108కు కాల్ చేశారు. పరిశీలించిన సిబ్బంది అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. అతిగా మద్యం సేవించడంతో గుండెపోటు వచ్చి మృతి చెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు.

నిధులు లేక.. పనులు సాగక!

ప్రతిపాదనలకే పరిమితమైన అభివృద్ధి | రూ.25 కోట్ల నుంచి 30 కోట్ల వరకు నిధుల అవసరం

కేపీహెచ్‌బీకాలనీ: గత ప్రభుత్వ హయాంలో మంజూరైన పనులు కూడా నిధులలేమితో పనులు నిలిచిపోయాయి. హెచ్ఎండీఏ నిధులు, ఎస్ఎన్‌డీపీ నిధులతో చేపట్టాల్సిన పనులు కూడా ముందుకు సాగడం లేదు. దాదాపుగా రూ. 25 కోట్ల నుంచి 30 కోట్ల వ్యయంతో చేపట్టాల్సిన పనులు ప్రతిపాదనల దశలోనే ఉన్నట్లు అధికారులు తెలిపారు.

మురుగు, వరద నీటి కాలువలు..

కేపీహెచ్‌బీకాలనీ 6వ ఫేజ్‌లోని ప్రధాన పార్కులలో మధ్యలో నుంచి గతంలో వేసిన మురుగునీటి పైపుల ద్వారా వెలువడే దుర్గంధంతో కాలనీ వాసులు, పార్కుకు ఉదయం, సాయంత్రం వచ్చే వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు ప్రజా ప్రతినిధుల దృష్టికి, అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. పార్కులో నుంచి ఉన్న డ్రైనేజీ లైన్‌లను బయట నుంచి నిర్మించేందుకు రూ. 2 కోట్ల వ్యయంతో పనులు చేపట్టేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. కానీ ఇంత వరకు పురోగతి లేదు. కేపీహెచ్‌బీ ఫోర్త్ ఫేజ్ వెంచర్ టూ సమీపంలోని సెల్లార్ గుంతలను ఆనుకొని ఉన్న రోడ్డులో డ్రైనేజీ లైన్‌ల నిర్మాణం పూర్తైంది. అయితే రోడ్డు నిర్మాణం కోసం రూ. 50 లక్షలతో పంపిన ప్రతిపాదనకు మోక్షం లేకుండా పోయింది. అదేవిధంగా కేపీహెచ్‌బీ – హైటెక్ సిటీ రోడ్డులో రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద నుంచి ముళ్లకత్వ చెరువు వరకు రూ.4 కోట్లతో చేపట్టాల్సిన వరద నీటి కాలువ పనుల కోసం ప్రతిపాదనలు పంపినా ఫలితం లేదు. వరద నీటి కాలువ పనుల ప్రాధాన్యతను దృష్టిలో పెట్టుకొని జీహెచ్ఎంసీ స్ట్రాటజిక్ నాలా డెవలప్‌మెంట్ ప్రాజెక్టు కింద తీసుకున్నప్పటికీ నిధులు మాత్రం మంజూరు కాలేదు.



9వ ఫేజులో పార్కు నిర్మాణం చేయాల్సిన స్థలం



9వ ఫేజ్‌లోని రెండున్నర ఎకరాల స్థలంలో చేపట్టనున్న పార్కు నమూనా చిత్రం

> కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు కాలనీలో అభివృద్ధి పనులు ప్రతిపాదనలకే పరిమితమయ్యాయి. నిధులు మంజూరుగాకపోవడంతో అభివృద్ధి పనులు ముందుకు సాగడం లేదు. స్థానికులు, ప్రజా ప్రతినిధులు అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి ప్రతిపాదనలు సిద్ధం చేసి నిధుల మంజూరు కోసం ఉన్నతాధికారులకు పంపడం సహజంగా జరుగుతుంది. అయితే ప్రతిపాదనలు ఎన్ని పంపినా నిధులు మంజూరు కాకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. డ్రైనేజీలైన్‌లు, వీధుల్లో రోడ్ల నిర్మాణం జరగక పోవడం, వర్షపు నీరు, మురుగునీటి డ్రైన్‌ల నిర్మాణం మొదలు కాకపోవడం, పార్కులు, ఆట స్థలాల అభివృద్ధి వంటి అనేక పనులు నిలిచిపోయాయి.

పార్కులు, ఆట స్థలాలు..

తొమ్మిదో ఫేజ్‌లో హౌసింగ్ బోర్డుకు చెందిన విలువైన రెండున్నర ఎకరాల స్థలాన్ని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అప్పటి మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ సహకారంతో పార్కు నిర్మాణం కోసం కేటాయింపజేశారు. పార్కు నిర్మాణం, కమ్యూనిటీ హాల్ నిర్మాణం, అన్ని వయస్సుల వారికి ఉపయోగపడేలా క్రీడా ప్రాంగణాల ఏర్పాటు వంటివి సుమారు రూ.10 కోట్ల వ్యయంతో నిర్మించేందుకు ప్రతిపాదనలు రూపొందించారు. సంవత్సరాలు గడుస్తున్నా ఇంతవరకు అతిగతి లేని పరిస్థితి నెలకొంది. 5వ ఫేజ్ వద్ద మలేషియా టౌన్‌షిప్ వెనుక వైపు ఉన్న 5 ఎకరాల స్థలంలో పార్కుతో పాటు క్రికెట్ క్రీడా ప్రాంగణం పనులు నిధుల లేమితో అరకొరగా మిగిలాయి. ఇందులో ఎకరం భూమిలో క్రికెట్ క్రీడా మైదానం అభివృద్ధి జరిగినప్పటికీ అనుబంధంగా చేపట్టాల్సిన ఇతర పనులు మాత్రం పూర్తి కాలేదు. మిగతా నాలుగు ఎకరాల స్థలంలో పార్కును అభివృద్ధి చేసేందుకు హెచ్ఎండీఏ ద్వారా పనులు చేపట్టాలని నిర్ణయించి హెచ్ఎండీఏకు అప్పగించారు. అయితే అక్కడ కూడా ఎలాంటి ముందడుగు పడలేదు. రెండున్నర ఎకరాల పార్కు, ఐదు ఎకరాల పార్కు రెండూ కూడా హెచ్ఎండీఏ ద్వారా చేపట్టేందుకు సదరు సంస్థ అంగీకారం తెలిపింది. ఆరు నెలలు గడిచినా ఇంత వరకు ఏ మాత్రం పనులు ముందుకు సాగకపోవడం గమనార్హం. మూడో ఫేజ్‌లోని ఇళ్ల నడుమ ఉన్న చిన్న చిన్న ఓపెన్ స్థలాలు కబ్జాకు గురి కాకుండా స్పందించిన హౌసింగ్ బోర్డు అధికారులు, జీహెచ్ఎంసీ అధికారులతో స్థలాలను పరిరక్షించారు. వాటిలో ఓపెన్ జిమ్, పిల్లల కోసం క్రీడా ప్రాంగణాలు అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. కానీ వాటి కోసం నిధులు కేటాయించలేదు. ఇలా కేపీహెచ్‌బీ కాలనీలోనే అనేక అభివృద్ధి పనులకు నిధులు మంజూరు కాక కేవలం ప్రతిపాదనలకు మాత్రమే పరిమితమయ్యాయి.

నిధులడిగితే స్పందన లేదు



అభివృద్ధి పనులను చేపట్టేందుకు అవసరమైన నిధులను మంజూరు చేయాలని ఎమ్మెల్యే ఆధ్వర్యంలో జీహెచ్ఎంసీ కమిషనర్, జోనల్ కమిషనర్‌కు నివేదించాం. అయినా వారి నుంచి స్పందన లేదు. నిధుల కేటాయింపు జరిగితేనే పనుల్లో పురోగతి సాధ్యం. అభివృద్ధి చేయాలని ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు. కనీసం అధికారులైనా స్పందిస్తారనుకుంటే నిధులు లేవని వారు కూడా చేతులెత్తేస్తున్నారు.

– మందడి శ్రీనివాసరావు, కేపీహెచ్‌బీ కార్పొరేటర్

పనుల కోసం ప్రతిపాదనలు పంపాం

కేపీహెచ్‌బీ కాలనీలో వసతుల కల్పనకు, అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరు కాగానే పనులు ప్రారంభిస్తాం. వరద నీటి కాలువల నిర్మాణం వంటి పనులు వర్షాకాలంలోగా పూర్తి చేయాల్సినవి ఉన్నాయి. అవి కూడా త్వరలోనే చేపడుతాము.

– సాయిప్రసాద్, ఏఈ, మూసాపేట సర్కిల్

మిగిలిన పనులు పూర్తి చేస్తాం

కార్పొరేటర్ సబిహా బేగం



మాట్లాడుతున్న కార్పొరేటర్ సబిహా బేగం

మోతీనగర్: బస్తీలు, కాలనీల్లో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను పూర్తి చేస్తామని అల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ సబిహాబేగం అన్నారు. బుధవారం వివేకానందనగర్ కార్యాలయంలో అన్ని బస్తీ, కాలనీల సంక్షేమ సంఘం అధ్యక్షులు, సీనియర్ నాయకులతో కలిసి బస్తీ అభివృద్ధిపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎమ్మెల్యే కృష్ణారావు సహకారంతో అన్ని బస్తీ, కాలనీల్లో మౌలిక వసతులను కల్పిస్తామన్నారు. మిగిలిన పనులను దశల వారీగా పూర్తి చేస్తామని, ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

కలెక్టరేట్ ఎదుట ఆశావర్కర్ల ఆందోళన

సాక్షి,సిటీబ్యూరో: ఆశ వర్కర్లను పర్మనెంట్ చేయడంతో పాటు నెలకు ఫిక్స్‌డ్ వేతనం రూ.18 వేలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు అశోక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈఎస్ఐ, పీఎఫ్ వంటి సౌకర్యాలు కల్పించాలని కోరారు. బుధవారం కలెక్టరేట్ ఎదుట తెలంగాణ ఆశావర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో ఆశావర్కర్లు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు హేమలత, రేవతి కల్యాణి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఆశాల సమస్యల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. సీఐటీయూ జిల్లా కోశాధికారి ఉన్నీకృష్ణన్, ప్రజాపాలన ప్రభుత్వంలో ఇప్పటి వరకు 300 మంది ఆశావర్కర్లతో సహా సీఐటీయూ జిల్లా నాయకులు రాజశేఖర్ లింగస్వామిలను అరెస్టు చేశారని, వారిని వెంటనే విడుదల చేయాలన్నారు. సీఐటీయూ శామీర్‌పేట్ కార్యదర్శి కృష్ణప్ప, ఆశావర్కర్లు రాధ, యాదమ్మ, లలిత, కోమలత, మంగ తదితరులు ఉన్నారు.

కాలనీ అభివృద్ధిలో భాగస్వాములవ్వాలి

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



నూతన కమిటీని సన్మానిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు

మోతీనగర్: కాలనీ అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములవ్వాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. స్నేహపురి కాలనీ సంక్షేమ సంఘం నూతన కమిటీ అధ్యక్షుడిగా ఎన్నికైన వినోద్‌యాదవ్, అసోసియేషన్ సభ్యులు ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావును, మాజీ కార్పొరేటర్ శ్రావణ్ కుమార్‌లను బుధవారం కలిశారు. నూతన కమిటీని సన్మానించి మాట్లాడారు. స్నేహపురి కాలనీ వాసులకు ఓపెన్ నాలా సమస్య నుంచి విముక్తి కల్పించామన్నారు. కాలనీ అభివృద్ధి కోసం, సమస్యల పరిష్కారం కోసం నూతన కమిటీ సభ్యులు నిరంతరం కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో అంబటి శ్రీనివాస్, వెంకటేశ్వర్‌రెడ్డి, చలమారెడ్డి, శ్రీనివాస్, దశరథ, రాము, నారాయణ రావు, ముస్తక్, వసీం, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

కోర్సుల ప్రమాణాల ఆధారంగానే ఎన్‌బీఏ గుర్తింపు

చైర్మన్, ప్రొఫెసర్ అనిల్ డి. సహస్రబుద్ధే



వర్కుషాపును ప్రారంభిస్తున్న ఎన్‌బీఏ చైర్మన్ అనిల్ డి. సహస్రబుద్ధే, జేఎన్‌టీయూహెచ్ వీసీ

కేపీహెచ్‌బీకాలనీ: అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా నిర్వహిస్తున్న కోర్సులకు మాత్రమే నేషనల్ బోర్డు ఆఫ్ అక్రిడేషన్ (ఎన్‌బీఏ) గుర్తింపు లభిస్తుందని ఎన్‌బీఏ చైర్మన్ ప్రొఫెసర్ అనిల్ డి. సహస్రబుద్ధే అన్నారు. రాష్ట్రంలోని ఇంజినీరింగ్ కళాశాలల కోసం 'అవుట్ కం బెస్ట్ ఎడ్యుకేషన్ అండ్ అక్రిడేషన్' అనే అంశంపై బుధవారం జేఎన్‌టీయూహెచ్‌లో వర్క్‌షాప్ నిర్వహించారు. నేషనల్ బోర్డు ఆఫ్ అక్రిడేషన్, జేఎన్‌టీయూహెచ్ సంయుక్తంగా నిర్వహించిన ఈ వర్క్‌షాపులో జేఎన్‌టీయూహెచ్ వీసీ, ప్రొఫెసర్ టి. కిషన్‌కుమార్ రెడ్డి, రెక్టార్ విజయకుమార్ రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వెంకటేశ్వరరావు, ఎన్‌బీఏ మెంబర్ సెక్రటరీ డాక్టర్ అనిల్ కుమార్, ఒడిశా స్టేట్ ఓపెన్ యూనివర్సిటీ వీసీ, ప్రొఫెసర్ ఎస్.ఎస్. పట్నాయక్, ప్రొఫెసర్ ఆర్.వి. రంగనాథన్ పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎన్‌బీఏ చైర్మన్, ప్రొఫెసర్ అనిల్ డి సహస్రబుద్దే మాట్లాడుతూ.. కళాశాలలు ఎన్‌బీఏ అక్రిడిటెడ్ అని రాసుకోవద్దన్నారు. ఎన్‌బీఏ గుర్తింపు కళాశాలలకు రాదని, అందులో అందిస్తున్న కోర్సులకు మాత్రమే వస్తుందని స్పష్టం చేశారు. ఎన్‌బీఏ గుర్తింపు పట్ల అవగాహన కల్పించేందుకు వర్క్‌షాపులు దోహదపడతాయని తెలిపారు. మెరుగైన ప్రమాణాలతో నిర్వహించే కోర్సులకు మూడు నుంచి ఆరేళ్ల వరకు గుర్తింపు ఇస్తున్నట్లు తెలిపారు. ఏజెన్సీలను ఆశ్రయించే అవసరం లేకుండ స్వీయ మూల్యాంకనం చేసుకోవచ్చని తెలిపారు. తొమ్మిది విభిన్న ప్రమాణాలను ఆధారంగా చేసుకొని సాగే గుర్తింపు ప్రక్రియకు వెయ్యి మార్కులను కేటాయించగా.. అత్యధిక మార్కుల ఆధారంగా గ్రేడింగ్ విధానంలో గుర్తింపు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

రేపటి నుంచి పదోతరగతి పరీక్షలు

- 5 నిమిషాలు ఆలస్యమైనా రానివ్వం
- జిల్లా విద్యాశాఖ అధికారి విజయకుమారి

సాక్షి,సిటీబ్యూరో: పదో తరగతి వార్షిక పరీక్షలు ఈనెల 21 నుంచి వచ్చే నెల 4 వరకు పకడ్బందీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి విజయకుమారి తెలిపారు. సైన్స్‌కు సంబంధించిన రెండు పేపర్లు మినహాయించి, మిగతా పరీక్షలు నిర్దేశించిన టైమ్‌టేబుల్ ప్రకారం ప్రతిరోజు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరుగుతాయన్నారు. గ్రేస్ పిరియడ్ 5 నిమిషాలు మాత్రమే ఉంటుందని, ఉదయం 9.35 గంటల తర్వాత వచ్చిన విద్యార్థులను పరీక్ష హాల్‌లోకి అనుమతించబోమని బుధవారం ఓ ప్రకటనలో స్పష్టం చేశారు.

◆ సైన్స్ పేపర్ (పార్టు) 1,2 పరీక్షలను మాత్రం నిర్దేశించిన తేదీల్లో ఉదయం 9.30 గంటల నుంచి ఉదయం 11 గంటల వరకు నిర్వహిస్తామన్నారు. విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు ఉదయం 8.30 గంటల వరకే చేరుకునేలా ఏర్పాట్లు చేసుకోవాలని ఆమె సూచించారు. పరీక్ష కేంద్రాలను కూడా పరీక్షలకు రెండ్రోజుల ముందే గుర్తించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాలోని 15 మండలాల పరిధిలో 230 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా, 47,930 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారన్నారు. వీరిలో 609 మంది ప్రైవేట్ విద్యార్థులు ఉన్నారన్నారు.

ఫోన్లు, ఎలక్ట్రానిక్ గాడ్జిట్స్ అనుమతి లేదు..

పరీక్షా కేంద్రాల్లోకి విద్యార్థులు మొబైల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ గాడ్జిట్స్ తీసుకురావొద్దని డీఈఓ విజయకుమారి తెలిపారు. పరీక్ష కేంద్రాల్లోకి హాల్‌టికెట్, పరీక్షప్యాడ్, పెన్, పెన్సిల్, స్కేల్ వారి వెంట తీసుకోవచ్చన్నారు. పరీక్షల నిర్వహణకు 3,200 మంది ఇన్విజిలేటర్లతో సహా 567 మంది చీఫ్ సూపరింటెండెంట్లు (సీఎస్),డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లను నియమించామన్నారు. 15 మంది ఫ్లైయింగ్ స్క్వాడ్‌లను నియమించడంతో పాటు కేంద్రాల సంఖ్యకు అనుగుణంగా సిట్టింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేశామన్నారు.

విద్యార్థులకు పరీక్ష కిట్టు అందజేత



మూసాపేట: జనతానగర్‌లోని ఎస్ఎం మోడల్ స్కూల్‌లో బుధవారం యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షులు ఎండీ సలీం ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థులకు ప్యాడ్, పెన్సిల్, పెన్ను తదితర వాటితో కిట్టును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు ఒత్తిడికి లోనుకాకుండా పరీక్షలు రాయాలన్నారు. ఎండీ అమీర్, సుల్తాన్ తదితరులు పాల్గొన్నారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ



సుభాష్‌నగర్: తాళం వేసి ఉన్న ఇంటిని దొంగలు లూటీ చేశారు. ఈ ఘటన సూరారం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ భరత్ కుమార్ వివరాల ప్రకారం.. గాజులరామారం డివిజన్ వీనస్ ఎన్‌క్లేవ్‌లో జాఫర్ అనే వ్యక్తి తన కుటుంబ సభ్యులతో కలిసి నివసిస్తున్నాడు. కుటుంబ సభ్యులతో కలిసి సొంతూరు కర్నూలుకు వెళ్లాడు. మంగళవారం తిరిగి ఇంటికి రాగా.. ఇంటి తాళం పగలగొట్టి ఉంది. ఇంట్లో దాచిపెట్టిన 22 తులాల బంగారు ఆభరణాలు, 80 తులాల వెండి చోరీకి గురైంది. ఈ విషయమై జాఫర్ బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో సీఐ భరత్ కుమార్ తమ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని ఆధారాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పార్కింగ్ చేసిన కారులో మంటలు

దుండిగల్: పార్కింగ్ చేసిన కారులో ఒక్కసారిగా మంటలు చెలరేగి దగ్ధమైంది. ఈ ఘటన దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. మియాపూర్ మాతృశ్రీనగర్‌కు చెందిన కె.కల్పనా రాణి ఉపాధ్యాయిరాలిగా పని చేస్తుంది. తన కుమార్తె ఇంటర్ మొదటి సంవత్సర పరీక్ష ఉండటంతో బౌరంపేటలోని శ్రీ చైతన్య కళాశాల సెంటర్‌కు బుధవారం ఉదయం తన కారులో తీసుకొచ్చింది. పరీక్ష ముగిసే వరకు పక్కనే వేచి చేస్తుంది. ఈ క్రమంలో మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఒక్క సారీగా కారులో మంటలు చెలరేగాయి. ఫైర్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. ఈ మేరకు దుండిగల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కార్యకర్తల కృషి వల్లే అధికారం

కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్



సమావేశంలో పాల్గొన్న బండి రమేష్, నాయకులు

బాలానగర్: క్రిందిస్థాయి కార్యకర్తల పోరాట పటిమతోనే కాంగ్రెస్ పార్టీ నేడు అధికారంలోకి రాగలిగిందని, వారిని కాపాడుకోవాల్సిన బాధ్యత పార్టీపై ఉందని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్ అన్నారు. నియోజకవర్గ పరిధిలోని అన్ని డివిజన్‌ల అధ్యక్షులు, సీనియర్ నాయకులతో కలిసి బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పార్టీ అగ్ర నాయకుడు రాహుల్ గాంధీ హామీ మేరకు రాష్ట్రంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించి రేవంత్ రెడ్డి మాట తప్పని నాయకుడు అయ్యారన్నారు. యువత, మహిళల అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తుందన్నారు. రాజీవ్ యువశక్తి పథకంలో అర్హులైన కార్యకర్తలందరూ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

బాలికల పాఠశాలలో ఆర్‌ఓ వాటర్‌ప్లాంట్ ప్రారంభం



ఆర్‌ఓ ప్లాంట్‌ను ప్రారంభించిన అల్లా దక్షయని, సుదీప్ నాయర్, కృష్ణకుమారి, ఎంపీ రామిరెడ్డి

మూసాపేట: మూసాపేటలోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో బుధవారం ఆర్‌ఓ వాటర్ ప్లాంట్‌ను రాంకీ ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ అల్లా దక్షయని, రీ సస్టైనబులిటీ లిమిటెడ్ కంపెనీ గ్లోబల్ సీహెచ్ఆర్ఓ సుదీప్ నాయర్ ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రారంభించారు. పాఠశాలలో రీ సస్టైనబులిటీ లిమిటెడ్ కంపెనీ సహకారంతో సుమారు రూ.14 లక్షల వ్యయంతో నాలుగు బాత్‌రూమ్‌లు, ఆరోఓ ప్లాంట్, ప్రతి అంతస్తులో మంచినీటి కనెక్షన్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పేద విద్యార్థులకు అన్ని సౌకర్యాలు సమకూర్చితే ఉన్నత స్థాయికి చేరుకుంటారని అన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం కృష్ణ కుమారి, రాంకీ ఫౌండేషన్ అధ్యక్షులు ఎంపీ రామిరెడ్డి, సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

వలస నాయకులకు గుణపాఠం తప్పదు



మాట్లాడుతున్న బీఆర్ఎస్ ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు విష్ణు

బాలానగర్: కూకట్‌పల్లి నియోజకవర్గంతో ఏ మాత్రం సంబంధం లేని కాంగ్రెస్ వలస నాయకులకు గుణపాఠం తప్పదని బీఆర్ఎస్ ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు బొట్టు విష్ణు అన్నారు. బుధవారం బాలానగర్‌లోని నర్సాపూర్ చౌరస్తాలో గల చిత్తారమ్మ డబుల్ బెడ్‌రూంల సముదాయం ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ఏ బ్లాక్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు మాదిరెడ్డి యుగంధర్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్ నియోజకవర్గ ప్రజలకు చేసిందేమీ లేదని ఎద్దేవా చేశారు. కేవలం రాజకీయాల కోసం రోజూ సోషల్ మీడియాలో ఉండటం కోసం నోటికొచ్చినట్లుగా వాగుతున్నారని, నోరు అదుపులో పెట్టుకుంటే మంచిదని హితవు పలికారు. వారు నివసించే ప్రాంతాల్లో రాజకీయాలు చేసుకుంటే మంచిదని సూచించారు. కాంగ్రెస్ నాయకుల అరాచకాలు, వసూళ్లు బయట పెట్టే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. ఎమ్మెల్యేపై తప్పుడు ఆరోపణలు చేస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. సమావేశంలో దర్శనం శాఖయ్య, ఎస్.వి. రత్నం, ప్రభాకర్, కృష్ణ, వెంకటేష్, మధు, మల్లేష్, సామేల్, నాగరాజు, కృష్ణ, అనురాధ తదితరులు పాల్గొన్నారు.



వ్యోమగామి సునీతా విలియమ్స్ పరిశోధన ముగించుకొని భూమిపై అడుగిడిన సందర్భంగా వివేకానందనగర్ కాలనీ గాంధీ హైట్స్ డి బ్లాక్ కిట్టీ గ్రూప్ మహిళా సభ్యులు బుధవారం సంబరాలు చేసుకున్నారు. కేక్ కట్ చేశారు.

– ఆల్విన్‌కాలనీ